
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.9, కనిష్ఠం 12.8

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్
జిల్లా వార్తలు

5 మంగళవారం 18 నవంబరు 2025

రేపు అండర్-14 హాకీ ఎంపికలు

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న అండర్-14, 21న అండర్-17 బాలబాలికల హాకీ ఎంపికలను నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్‌లోని మినీ స్టేడియంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు పిజికల్ డైరెక్టర్ రమణ 9848426821 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



కంఠేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కార్తీక శోభ

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు
- చివరి సోమవారం కావడంతో భక్తుల రద్దీ

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం శివుడికి ప్రీతికరమైనది కావడంతో శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు సాగాయి. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆలయాలతో పాటు వివిధ మండలాల్లోని శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాస చివరి సోమవారం కావడంతో ఆలయాల్లో ఉదయం ప్రారంభమైన అభిషేకాలు ప్రదోశకాల పూజల వరకు సాగాయి. భక్తులు నదీతీర ప్రాంతాల్లో స్నానాలు ఆచరించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో అర్చకులు ఆకాశదీపానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశంవైపు పంపించగానే భక్తులు

మిగతా 8వ పేజీలో...







ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కంఠేశ్వర ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ధాన్యం కొనుగోలు చేయని వారికి కేంద్రాల మంజూరు లేదు


- ధాన్యం సేకరణ జరిపే అవకాశాలు లేనప్పుడు కేంద్రాలను ఎందుకు ఏర్పాటు చేశారు
- ఇప్పటికే ధాన్యం సేకరణ పూర్తయిన చోట కేంద్రాలను మూసివేయాలి
- సమీక్ష సమావేశంలో టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయని వారికి వచ్చే సీజన్ నుంచి కొనుగోలు కేంద్రాలను మంజూరు చేయబోమని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. పలు కేంద్రాల్లో ఇంకనూ ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడంతో మండల ఇంచార్జీలను కారణాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణ జరిపే అవకాశాలు లేనప్పుడు కేంద్రాలను ఎందుకు ఏర్పాటు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరుపై కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సమీక్ష జరిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఐకేపీ ఏపీఎంలు, సహకార సంఘాల మండల ఇన్‌చార్జీలు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లతో ఒక్కో మండలం వారీగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులను సమీక్షించారు. ధాన్యానికి సంబంధించి రైతులకు బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయా అని ఆరా తీశారు. ఇప్పటికే ధాన్యం సేకరణ పూర్తయిన చోట చాటింపు వేయించి కేంద్రాలను మూసివేయాలని సూచించారు. బిల్లుల చెల్లింపులలో అలసత్వం వహిస్తున్న కేంద్రాల ఇన్‌చార్జీలపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మిల్లుల వద్ద సకాలంలో ధాన్యం దించుకునేలా పర్యవేక్షణ జరుపుతూ, వెంటవెంట ట్రక్ షీట్లు తెప్పించుకుని ఓపీఎంఎస్ ఎంట్రీలు జరపాలని పదేపదే సూచించినప్పటికీ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, డీఆర్డీవో సాయాగౌడ్, పౌరసరఫరాల డీఎం శ్రీకాంత్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, డీసీవో శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల వారోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

8

డీసీసీపై వీడని ఉత్కంఠ



- నేడు, రేపు అంటూ అధిష్ఠానం ఆలస్యం
- స్థానిక ఎన్నికలకు ముందే నూతన అధ్యక్షులను ప్రకటించే అవకాశం
- ఆశావహులకు తప్పని ఎదురుచూపులు

నిజామాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ జిల్లా నూతన అధ్యక్షుల ఎంపిక రోజురోజుకూ ఆలస్యమవుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో అధిష్ఠానం పంపిన పరిశీలకులు అభిప్రాయ సేకరణ చేశారు. ఈ నెల మొదటివారంలోనే నూతన అధ్యక్షుల ప్రకటన వెలువడుతుందని ఆశించినప్పటికీ జూబ్లీహిల్స్ ఎన్నికల హడావిడి వల్ల నూతన అధ్యక్షుల ప్రకటన చేయలేదు. ఇప్పటికే ఏఐసీసీ పరిశీలకులు క్షేత్రస్థాయి అభిప్రాయాలతో కూడిన నివేదికను పార్టీ అధిష్ఠానానికి అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, తదితర ముఖ్య నేతలు సైతం ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ కార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌తో సమావేశమై ఇప్పటికే తమ అభిప్రాయాలను తెలియజేశారు. సామాజిక సమీకరణల వారీగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం చేసేందుకు పార్టీ అదిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో స్థానిక ఎన్నికలపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉండగా స్థానిక ఎన్నికల షెడ్యూల్‌కు ముందే జిల్లా కాంగ్రెస్‌కు నూతన అధ్యక్షుల నియామకం జరిగే అవకాశాలు ఉన్నాయి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు తెలంగాణలో జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులను నియమించేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఒకేసారి మూడు రాష్ట్రాల డీసీసీ అధ్య క్షులను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపొందగా ఆయనను అభినందించేందుకు ఢిల్లీ వెళ్లిన సీఎం, పీసీసీ అధ్య క్షుడు డీసీసీ అధ్యక్షుల నియామకంపై పార్టీ పెద్దలతో చర్చించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో నూతన కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులను ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కాగా, నేడే, రేపో ప్రకటన వెలువడుతుందనే ఊహాగానాలు విన వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీకి ఆశావహులు ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లా ముఖ్య నాయకులను కలుస్తూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

ఓసీకా.. బీసీకా..

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం తీవ్ర పోటీ నెలకొంది. దేశంలో ప్రయోగాత్మకంగా ఏఐసీసీ తెలంగాణలోనే మొదటిసారిగా క్షేత్రస్థాయి కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి ఎంపిక చేసేందుకు కర్నాటకకు చెందిన రిజ్వాన్ అర్షద్‌ను పరిశీలకుడిగా నియమించింది. గత నెల 13 నుంచి 18 వరకు జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో క్షేత్రస్థాయి

మిగతా 8వ పేజీలో...

కాంగ్రెస్ నగర అధ్యక్ష పదవికి సైతం తీవ్ర పోటీ..

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవితో సరిసమానమైన ప్రాధాన్యం కలిగిన కాంగ్రెస్ నగర అధ్యక్ష పదవికి సైతం తీవ్ర పోటీ నెలకొంది. నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవికోసం చాలామంది సీనియర్ నేతలు పోటీపడ్డారు. కానీ పీసీసీ నుంచి ఢిల్లీకి వెళ్లిన జాబితాలో కేవలం నలుగురి పేర్లు మాత్రమే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీనియర్ నాయకుడు నరాల రత్నాకర్‌తో పాటు యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు రామర్తిగోపి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు గస్‌రాజ్‌లు ప్రధానంగా పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఓసీకి కేటాయిస్తే నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి బీసీకి కేటాయించే అవకాశాలు ఉన్నాయి. పోటీలో ఉన్నవారంతా బీసీ నాయకులే కావడంతో ఎవరికి పదవి దక్కుతుందనే విషయంలో ఉత్కంఠ నెలకొంది. పీసీసీ అధ్యక్షుడి సొంత జిల్లా కావడం, గతంలో ఆయన ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావడంతో నిజామాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆయన అనుచరులకే దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



బాసరకు నది స్నాన పాదయాత్ర

నవీపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయం నుంచి బాసరకు సోమవారం ఆలయ వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో కార్తీక మాస నది స్నాన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి వద్ద శివలింగానికి అభిషేకం, గోదావరి మాతకు ముత్తైదువులతో హారతి నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న సిద్దేశ్వర మహరాజ్

రక్తహీనత శాపం.. అప్రమత్తతే మార్గం

- గర్భిణుల్లో పెరుగుతున్న రక్తహీనత సమస్య
- పోషకాహారం తీసుకోవాలంటున్న వైద్యులు

7

పత్తి కొనుగోళ్లకు నిబంధ్‌నల సవాళ్లు

- సీసీఐ నిబంధనలపై కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ ఆగ్రహం
- పత్తి జిన్నింగ్ మిల్లుల బంద్‌కు పిలుపు



వినతిపత్రాన్ని అందజేస్తున్న రాజుగౌడ్

హైకోర్టు తీర్పును అమలు చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమ నియామకాలను రద్దుచేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి రాజుగౌడ్ టీయూ రిజిస్ట్రార్ యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. డిచ్‌పల్లిలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం కలిసి హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని రాజుగౌడ్ కోరారు.

సైబర్ మోసం

- నగరవాసి నుంచి రూ.10 లక్షలు కాజేసిన కేటుగాళ్లు
- సేవింగ్ ఖాతా నుంచి ఫోన్‌పే ద్వారా రెండు దఫాలుగా పది లక్షలు మాయం
- మొబైల్‌ను హ్యాక్ చేసి డబ్బులు కాజేసిన వైనం

6



నిండుకుండలా జక్రాన్‌పల్లి పెద్ద చెరువు

నిండు కుండలా.. జలాశయాలు

- కురిసిన భారీ వర్షాలు
- నిండిన చెరువులు, కుంటలు
- పారిన అలుగులు
- పెరిగిన భూగర్భజలాలు
- యాసంగి సాగుకు ఢోకా లేదంటున్న రైతులు

జక్రాన్‌పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో భారీ వర్షాలు కురువడంతో చెరువులు, కుంటలు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. చెరువులు నిండి అలుగులు పారాయి. వాగులు పొంగి పొర్లాయి. దీంతో చెరువులు నిండి అలుగులు పారుతూ జలకళను సంతరించుకున్నాయి. వర్షాకాలం ప్రారంభమైన మొదట జూన్‌లో అడపదడప వర్షాలు కురువడంతో వానకాలం సాగుకు సన్నద్ధమైన రైతులు ఆందోళన చెందారు. దుక్కులు దున్ని విత్తనాలు వేసిన రైతులు వర్షాల కోసం ఆశగా ఎదురు చూశారు. జూలై, ఆగస్టులో అడపదడప కురువగా సెప్టెంబర్, అక్టోబర్‌లో భారీ వర్షాలు పడ్డాయి. దీంతో గ్రామాల్లో చెరువులు నిండి అలుగులు పారాయి. మండలంలోని 21 గ్రామాల్లో కలిపి 9 పెద్ద చెరువులు ఉండగా 39 చిన్న కుంటల చెరువులు ఉన్నాయని ఇరిగేషన్ ఏఈ సిద్దార్థ రెడ్డి తెలిపారు. పుప్పాలపల్లిలో బోరెడి కుంట చెరువు నిండింది. కానీ అలుగు పారలేదన్నారు. ఈ చెరువుకు వరద కాలువలు లేవన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో కలిపి 65 వ్యవసాయ బావులు ఉండగా 4,435 బోరుబావులు ఉన్నాయని వ్యవసాయాధికారి దేవిక తెలిపారు. గత ఏడాది మండలంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఈ కాలం ముగిసే వరకు 1049. 3 ఎంఎం వర్షం కురువగా అంటే 104 సెంటి మీటర్ల వర్షం కురిసినట్లు ఎంపీఎస్‌వో వర్ష తెలిపారు. ఈ ఏడాది వర్షాకాలం జూన్ నెల ప్రారంభం

మిగతా 8వ పేజీలో...



జక్రాన్‌పల్లిలో మొక్కజొన్న విత్తనాలు వేసి చేనులో సాల్లు చేస్తున్న రైతులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు తప్పదు
- ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

వేల్పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువత గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి వేల్పూర్ బీసీ కాలనీలో పోలీస్‌లు నిర్వహించిన కార్డన్‌చర్చ్‌లో మాట్లాడారు. అపరిచితులు, గుర్తు తెలియని వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇవ్వొద్దని ఏసీపీ సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులతో పాటు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. అంతకుముందు బీసీ కాలనీలో నిర్వహించిన కార్డన్‌చర్చ్‌లో ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఇళ్లలో ఉన్న ద్విచక్ర వాహనాలు, వాహనాలతో పాటు కార్లు, ఆటోలకు సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ రూరల్, భీమ్‌గల్ సీఐలు శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, స్థానిక ఎస్సై సంజీవ్, ఆర్మూర్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి



విజేతలకు షీల్డును అందిస్తున్న పోలీసు కమిషనర్ సాయి చైతన్య

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- పోలీసు కమిషనర్ సాయి చైతన్య
- బోధన్ రూరల్ సర్కిల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్
- విజేతలకు బహుమతులను అందజేసిన సీపీ

ఎడపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండడమే పోలీస్ శాఖ లక్ష్యమని పోలీసు కమిషనర్ సాయి చైతన్య అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా యవత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు బోధన్ రూరల్ సర్కిల్ ఆధ్వర్యంలో మండల పరిధిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో సాలూర టీంతో బోధన్ రూరల్ పోలీస్ శాఖ తలపడగా సాలూర జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సీసీ సాయి చైతన్య విన్నర్‌కు రూ.25వేలు, రన్నర్ టీంకు రూ.11 వేలను అందజేశారు. ఈ సందర్భంగా బోధన్ రూరల్ సర్కిల్ పోలీస్ శాఖను సీపీ సాయి చైతన్య, ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు. నిషేధిత డ్రగ్స్‌పై ప్రచురించిన వాల్ పోస్టర్‌లను సీపీ ఆవిష్కరించారు. ఇటీవల నిర్వహించిన పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు సీపీ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ విజయ బాబు, బోధన్ పట్టణ ఎస్సై వెంకట నారాయణ, రుద్రూర్ ఎస్సై కృష్ణ, ఎడపల్లి ఎస్సై రమ, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, కోటగిరి ఎస్సై సునీల్, క్రీడాకారులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న సీపీ

క్రైం సమాచారం

బీర్కూర్‌లో చోరీ


చోరీ వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

బీర్కూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గాండ్ల సంజీవ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో నాలుగున్నర తులాల బంగారు నగలు, 13 తులాల వెండి నగలు, 2.50 లక్షల రూపాయల నగదు దొంగలు ఎత్తుకుపోయారని బాధితులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్‌కు చెందిన గాండ్ల సంజీవ్ శనివారం తన ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా అత్తగారింటికి చింత కుంటకు వెళ్లాడు. అత్తగారు ఇంటి వాళ్ళు పండగ చేస్తున్నారని వారి ఆహ్వానం మేరకు వెళ్ళమని సంజీవ్ తెలిపారు. రెండు రోజుల అనంతరం సోమవారం సాయంత్రం సంజీవ్ ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వేసిన తాళాలు పగిలి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న బీరువా తెరిచి ఉంది. బీరువాలో దాచి ఉంచిన బంగారం, వెండి ఆభరణాలు, నగదు కనిపించలేదు. దీంతో సంజీవ్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మహేందర్ పోలీసు సిబ్బంది సంజీవ్ ఇంటికి చేరుకున్నారు. అనంతరం డీఎస్పీ విఠల్ రెడ్డి, సీఐ తిరుపయ్య ఘటన స్థలానికి చేరుకుని ఇంటిని అన్ని దిక్కులా పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించారు. క్లూస్ టీం బృందం వారు వేలి ముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. విచారణ చేపట్టి చోరీకి పాల్పడిన వారిని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ అన్నారు.

డయల్ 100 దుర్వినియోగం చేయొద్దు

ధర్పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 100 డయల్‌ను దుర్వినియోగం చేస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై ఎం.కళ్యాణి సోమవారం అన్నారు. ఈ నెల 15న మద్యం మత్తులో పలుమార్లు 100కు కాల్ చేసి పోలీసుల విధులకు రేకులపల్లికి చెందిన గుజ్జుల రాజు ఆటంకం కలిగించాడన్నారు. విచారణ జరిపిన మెజిస్ట్రేట్ అతనికి 7రోజుల జైలుశిక్షను విధించినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి మృతి


బాలుచందర్ (ఫైల్)

ధర్పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన బాలుచందర్ (22) యువకుడు ప్రమాదవశాత్తు బ్రిడ్జిపై నుంచి కారు కాలువలో పడటంతో బాలుచందర్ అక్కడికక్కడే కారులోనే మృతి చెందాడు. ఆదివారం రాత్రి డీజే ప్రోగ్రాంకు వెళ్లివస్తుండగా గ్రామ శివారులోగల వాగులోకి కారు దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే కారులో ఉన్న బాలుచందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అర్ధరాత్రి సమయం కావడంతో బోల్తాపడ్డ కారును ఎవరూ గుర్తించలేదు. సోమవారం ఉదయం అటువైపుగా వెళ్లిన గ్రామస్తులు కాలువలో పడ్డ కారును చూసి పోలీసులకు సమాచారం అందించారు. జేసీబీ సహాయంతో కారును పైకిలాగి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నిజాంసాగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట మాగి గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున అక్రమంగా మంజీరా వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నామని, అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ట్రాక్టర్, టిప్పర్ పట్టివేత

కోటగిరి,నవంబరు17(ఆంధ్రజ్యోతి): కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలలో మొరం టిప్పర్, ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. అనుమతి లేకుండా రాంపూర్ గుట్ట నుంచి మొరం తరలిస్తుండగా టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కొడిచర్ల గ్రామంలో తెల్లవారుజామున ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా మొరం, ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

రెంజల్,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ నుంచి ధర్మాబాద్ వెళ్తున్న లారీ డివైడర్‌ను ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి డివైడర్ మధ్యలోకి రావడంతో డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. డివైడర్‌ను ఢీకొట్టిన శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రూ.10 వేల జరిమానా

రెంజల్,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన సాటాపూర్ గ్రామానికి సుద్ద వీరయ్య అనే వ్యక్తికి 10వేల రూపాయల జరిమాన విధించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపినట్లయితే 10వేల జరిమానతో పాటు జైలుశిక్ష పడుతుందన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపరాదని అన్నారు.

యువతి అదృశ్యం


విస్లవత్ అనూష

నవీపేట,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాన్ ఫారం పంచాయతీ పరిధిలోని శ్రీరాంతండాకు చెందిన విస్లవత్ అనూష(20) అనే యువతి అదృశ్యమైందని ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఈ నెల 16న బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. అనూష గురించి బంధువులు, చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని ఎస్ఐ తెలిపారు. సోమవారం తల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగరంలో ఒకరు..

సుభాష్‌నగర్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : 3వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణపతి అనే వ్యక్తి అదృశ్యమైనట్లు 3వటౌన్ ఎస్ఐ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 14న నామ్‌దేవ్‌వాడలోని కొడుకు ఇంటికి వెళ్తొస్తానని చెప్పి తిరిగి రాలేదని, వ్యక్తి ఆచూకీ తెలిసినచో వెంటనే 3వటౌన్ పోలీస్ స్టేషన్‌కు తెలపాని కోరారు. వివరాలు తెలిస్తే 8712659839 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అభంగపట్నంలో బార్బర్ షాపు దగ్ధం

నవీపేట,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అభంగపట్నంలో ఆదివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో బార్బర్ షాప్ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు సతీష్ ప్రధాన రహదారి పక్కన షెడ్డులో బార్బర్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో షాట్ సర్క్యూట్‌తో దుకాణం నుంచి మంటలు రావడంతో స్థానికులు ఫైర్ సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. వారు మంటలను ఆర్పి వేశారు. లక్ష వరకు నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

వేల్పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద బడుగు బలహీన మైనార్టీ వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కో-ఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం వేల్పూర్‌లోని జుంబరాతి బాలమణి, మహేష్ ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. అనంతరం మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డితో కలిసి ఆయన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మానాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గౌరాయి నరేందర్, రాజేందర్, గంగయ్య, రేవంత్‌రెడ్డి , భూమారెడ్డి, రాజు, దామోదర్ గౌడ్, రమణ, లహరి, లావణ్య, సతీష్, మధు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గృహ ప్రవేశాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

కరాటే, కర్ర సాము శిక్షణ

డొంకేశ్వర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికల ఆత్మ రక్షణ కోసం కరాటే కర్ర సాము తరగతులు ఉపయోగపడతాయని డొంకేశ్వర్ ప్రధానోపాధ్యాయుడు సురేష్ కుమార్ అన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు సోమవారం నుండి కరాటే, కర్ర సాము, తరగతులు ప్రారంభించారు. వారంలో మూడు రోజులు,మూడు నెలల పాటు ఈ తరగతిలో కొనసాగుతాయని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో నెలకొన్న పరిస్థితులలో బాలికలు ఆత్మవిశ్వాసంతో ఉండి ఆత్మరక్షణ కోసం కరాటే కర్రసాము తరగతులను నేర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి కష్టతరమైన పరిస్థితుల్లోనైనా తనను తాను రక్షించుకోవడానికి ఈ తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ తీసుకుంటున్న బాలికలు

వరి కొయ్యలు కాల్చవద్దు

జక్రాన్‌పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో వరి కొయ్యలు కాల్చవద్దని, వరికొయ్యలు కాల్చడం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గుతుందని వ్యవసాయాధికారిణి దేవిక రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలలో పొలాల్లో కాల్చివేసిన వరికొయ్యలను ఆమె పరిశీలించారు. వరికొయ్యలను కాల్చివేయడంతో సేంద్రీయ పదార్థాలు, పోషకాలు నశిస్తాయన్నారు. వరి కోతల తర్వాత కొయ్యలను కాల్చకుండా పొలంలో ఉంచాలన్నారు. యంత్రాలతో అవశేషాలను చిన్న ముక్కలుగా చేయాలని పొలంలో నీరుపెట్టి ట్రాక్టర్ రోటవేటర్ తో 25 రోజులలో రెండుసార్లు దమ్ము చేస్తే వరిగడ్డి కుళ్ళి పంటకు సేంద్రీయ కర్బనం అందుతుందన్నారు. తర్వాత రైతులు వరినాట్లు వేసుకోవాలన్నారు.

పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలన

కోటగిరి,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పలు అభివృద్ధి పనులను సోమవారం ఎంపీడీవో విష్ణు పరిశీలించారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లో పాఠశాలకు 10లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలలలో రూఫ్ మరమ్మతులు, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, తాగునీటి మరమ్మతు పనులు ఎంపీడీవో పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం పాఠశాలలో పలు రికార్డులను పరిశీలించారు. 10వతరగతి విద్యార్థులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రావు, పీఆర్‌టీయూ అధ్యక్షులు బర్ల సాయిలు, ఏఈలు నవదీష్ గౌడ్, ఆదర్శ్ గౌడ్, నాయకులు కొట్టం మనోహర్ పాల్గొన్నారు.

దంతాల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

ఎడపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం దంతాల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన మల్కా రిషిత సంగారెడ్డిలోని ఎమ్ఎన్నార్ దంత కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతూ తెలంగాణ ఓరల్ హెల్త్ ఫర్ ఎవ్రీ చైల్డ్ కార్యక్రమంలో భాగంగా ఏఆర్పీ క్యాంపు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు పేస్టు, బ్రష్‌లను అందజేశారు. కార్యక్రమంలో మల్కా స్వామి, మహబూబ్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, ప్రవీణ్ పాల్గొన్నారు

యువకుడిపై పిచ్చికుక్క దాడి

లింగంపేట, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జీవదాన్ పాఠశాల సమీపంలో సోమవారం పిచ్చికుక్క పాఠశాలకు వెళుతున్న పిల్లలపైకి దాడికి రాగా పిల్లలపైకి వస్తున్న కుక్కను తరిమే ప్రయత్నం చేయగా యువకునిపై దాడి చేసింది. మంగళి స్వామి తన పిల్లలను జీవాదాన్ పాఠశాలలో దింపేందుకు బైక్‌పై రాగా అక్కడే ఉన్న పిచ్చి కుక్క పిల్లలపై దాడికి ప్రయత్నించగా కుక్క స్వామిపై దాడి చేసింది. దీంతో యువకుడు కుక్కను పట్టుకోగా అక్కడే ఉన్న రైతులు కుక్కను కర్రలతో కొట్టి చంపారు. దీంతో చిన్న పిల్లలపై దాడి చేకుండా కాపాడరు. స్వామికి గాయాలయ్యాయి.

బస్సు ఢీకొని యువకుడి మృతి

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బస్సును ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ఎల్లారెడ్డి పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన ప్రకారం.. కామారెడ్డి నుంచి పిట్లం వైపు వెళ్తున్న కామారెడ్డికి చెందిన పల్లెవెలుగు బస్సు మార్గమధ్యలో హాజీపూర్ గ్రామంలో ప్రయాణికులను దించేందుకు డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బస్సు వెనకాలే ద్విచక్రవాహనంపై వస్తున్న లింగంపేట్ మండలం మంబోజీపేట్‌కు చెందిన చిన్న కాశీరాం(32) ఢీకొని అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

నగరంలో బాలిక కిడ్నాప్ కలకలం

సుభాష్‌నగర్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : నగరంలో బాలిక కిడ్నాప్ కలకలం రేపింది. 2వటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉదయం పాఠశాలకు వెళ్లి తిరిగిరాకపోవడంతో తల్లిదండ్రులు 2వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక కిడ్నాప్ అయిందన్న ఫిర్యాదుతో ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ శ్రీనివాసరాజు, 2వటౌన్ ఎస్ఐ సయ్యద్ ముజాహిద్ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేశారు. బర్కత్‌పురకు చెందిన 7వ తరగతి చదువుతున్న విద్యార్థి ఉదయం పాఠశాలకు వెళ్లి గంట తర్వాత తనను కారులో వచ్చి కిడ్నాప్ చేశారని కుటుంబసభ్యులకు తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు 2వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా 2వ టౌన్ ఎస్ఐ సయ్యద్ ముజాహిద్ బాలిక ఇంటి వద్ద నుంచి పాఠశాల వెళ్లే మార్గంలో సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎక్కడ బాలిక కిడ్నాప్ చేస్తున్న దృశ్యాలు కనిపించకపోవడంతో బాలికతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాలిక పొంతలేని సమాధానాలు చెప్పడంతో అసలు కిడ్నాప్ జరగలేదని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పాఠశాలకు వెళ్లడం ఇష్టంలేకనే కుటుంబ సభ్యులను తప్పుదోవపట్టించిందని పోలీసు విచారణలో తెలిసింది. కిడ్నాప్‌పై మరింత లోతుగా విచారణ చేస్తామని టౌన్ నగర సీఐ శ్రీనివాసరాజు తెలిపారు.

నగరవాసికి సైబర్ మోసగాళ్ల టోకరా

● సేవింగ్ ఖాతా నుంచి ఫోన్‌పే ద్వారా రూ. 10 లక్షలు

● మొబైల్‌ను హ్యాక్ చేసిన హ్యాకర్లు

● రెండు దఫాలుగా రూ.10 లక్షలు మాయం

నిజామాబాద్ సిటీ (రూరల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ వ్యాపారికి సైబర్ మోసగాళ్లు భారీ టోక రా వేశారు. జిల్లాకేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ సమీపంలో నివాసముండే శేఖర్ అనే వ్యాపారి ఖాతా నుంచి రూ. 10 లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెళితే.. కంఠేశ్వర్ బైపాస్‌లో నివాసముండే శేఖర్ అనే వ్యాపారి నగరశివారులో రైసుమిల్లు నిర్వహిస్తున్నాడు. ఇతనికి నగరంలోని మారుతినగర్‌లోని ఓ బ్యాంక్‌లో సేవింగ్ ఖాతా ఉంది. ఇతని బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.10 లక్షలు గుర్తుతెలియని వ్యక్తులు కాజేశారు. శేఖర్ జియోనెంబర్ నెట్‌వర్క్ వాడుతున్నాడు. ఆదివారం రాత్రి సమయంలో ఆయన ఫోన్ ఆటోమేటిక్‌గా స్విచ్ ఆఫ్ అయింది. ఆయన రీస్టార్ట్ చేశాడు. తన ఫోన్ నుంచి ఫోన్‌కాల్స్ చేస్తే అవుట్ గోయింగ్ వెళ్లడం లేదు. నెట్‌వర్క్ పనిచేయడం లేదు. సోమవారం ఉదయం కూడా ఫోన్ పనిచేయకపోవడంతో జియో మొబైల్ కస్టమర్ కేర్‌కు ఫోన్‌చేసి సమస్య తెలుసుకుంటే ఆయన ఫోన్‌ను బ్లాక్‌లో పెట్టినట్లు చెప్పారు. తనకు తెలియకుండా తన ఫోన్ బ్లాక్‌లో పెట్టడంపై అనుమానం వ్యక్తం చేశాడు. రీయాక్టివేట్ చేయగా మెసేజ్‌లు వచ్చా యి. తన సేవింగ్ ఖాతా నుంచి రూ.5 లక్షల చొప్పున రెండుసార్లు డ్రా చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. అనుమాన నివృత్తికోసం బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీయగా తన ఖాతాలోంచి రూ.10 లక్షల డ్రా చేసుకున్నట్లు తెలిసింది. తన సేవింగ్ ఖాతాలోంచి అజ్ఞాతవ్యక్తులు రూ.5 లక్షలు ఒకసారి, వెంటనే మరో రూ.5 లక్షలు డ్రా చేసుకున్నట్లు తెలిసింది. తన ఖాతాలో మొత్తం రూ.17 లక్షల వరకు డబ్బులున్నట్లు బాధితుడు తెలిపారు. వెంటనే తన బ్యాంక్ ఖాతాను బ్లాక్ చేశాడు. తాను మోసపోయినట్లు గ్రహించి వెంటనే సైబర్ క్రైంలో 1930కు రిపోర్టు చేశాడు. రూరల్ పోలీసులు పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

సాలూర పాఠశాలలో పౌష్టికాహారం అందజేత

సాలూర,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మధుమేహం కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంతో పాటు రోగ నిరోధక శక్తి పెంచే ఉదలు అనే పౌష్టికాహారాన్ని సోమవారం సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అందజేశారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఎలాంటి రోగాల బారిన పడకుండా ఉండాలంటే నిత్యం ఇలాంటి పౌష్టికాహారం తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి రాజీ మంజూష అన్నారు.

వృద్ధాశ్రమాల్లో వైద్య శిబిరం

ఆర్మూర్ , నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలం అంకాపూర్‌లోని లాలన, ప్రొద్దుటూరి సదానంద్‌రెడ్డి వృద్ధాశ్రమాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహ వ్యాధి, హిమోగ్లోబిన్ వ్యాధి, కంటి పరీక్షలను నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అదే విధంగా వృద్ధులు తీసుకోవాల్సిన ఆహార నియమాలు, వ్యాయామ పద్ధతులు, నడక, ఇతర అంశాలపై వైద్యులు అవగాహన కల్పించారు. వృద్ధుల మానసిన ఆరోగ్యంపై కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రక్షిత, డాక్టర్ నీలిమ, వైద్య సిబ్బంది అంజలి, వంశీకృష్ణ, రాజ్యలక్ష్మీ, చంద్రలేఖ, జ్యోతి, అనూష, మేరి పాల్గొన్నారు.

కళను బతికించాలి

పెర్కిట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ఏరియా ప్రజా నాట్య మండలి కమిటీ సమావేశం సోమవారం సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శివలింగం మాట్లాడుతూ కళాకారులందరు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కుతాడి ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ప్రజానాట్య మండలి ఆర్మూర్ ఏరియా నూతన కమిటి ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా తొగటి భూమేశ్వర్, అధ్యక్షులుగా బోయ మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కుతాడి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా రామోజీ అశోక్, గంగాధర్, కోశాధికారిగా లావణ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సిద్ధుల గుట్టపై సహస్ర లింగార్చణ

పెర్కిట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై సోమవారం సిద్ధుల గుట్ట ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య సహస్ర లింగాచర్చ పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. దాదాపు వేయిమందికి పైగా మహిళ భక్తులు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ వారు పూజాసామగ్రితో పాటు పుట్టమట్టితో తయారు చేసిన లింగాలను అందజేశారు. ఆ లింగాలకు భక్తులు పంచామృతాలతో అభిషేకం చేశారు. వేదికపైకి ఆలయ కమిటీ వారు పల్లకిలో శివపార్వతులను, సీతారామ చంద్రులతో పాటు అయ్యప్ప, ఆంజనేయ స్వామి విగ్రహాలను తీసుకువచ్చి పూజా కార్యక్రమం నిర్వహించారు. నందీశ్వర మహారాజ ఆధ్వర్యంలో సప్త హారతులతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, రవి, బట్టు శంకర్, ప్రశాంత్ గౌడ్, ఆలయ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా సూచనలు పాటించాలి

● రుద్రూర్ ఏడీఈ తోట రాజశేఖర్

కోటగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించుకునేందుకు భద్రతా సూచనలు తప్పనిసరి పాటించాలని రుద్రూర్ ఏడీఈ తోట రాజశేఖర్ పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం విద్యుత్ భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రుద్రూర్ ఏడీఈ తోట రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామంలో ఓ వ్యక్తి ఇనుప మెట్లపై కూర్చుని షాక్‌తగిలి చనిపోవడం బాధాకరమన్నారు. ఇంటి దాబాలపై వైర్లు కట్టి బట్టలు ఆరవేయకూడదని సూచించారు. సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడవద్దన్నారు. తెగిపడిన విద్యుత్ వైర్లను తాకరాదన్నారు. వర్షం పడిన సమయంలో ఎలక్ట్రికల్ పోల్స్ చెట్ల కొమ్మలను తాకవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలివేలు, కోటగిరి ఏఈ బుజ్జిబాబు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌కు అనుమతులు ఇవ్వవద్దని నిరసన


రోడ్డుపై బైఠాయించిన కాలనీవాసులు

కమ్మర్‌పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కమ్మర్‌పల్లి నుంచి ఉప్లూర్ వెళ్లే దారిలో రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జీ సమీపంలో వైన్స్‌కు అనుమతులు ఇవ్వవద్దని కాలనివాసులు, మహిళలు రోడ్డుపై ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. తమ కాలనీలో రోడ్డపక్కనే నివాసగృహాల మధ్య వైన్స్ కొనసాగిస్తున్నారని మందుబాబులు వైన్స్ పక్కనున్న నివాసగృహాలవద్ద న్యూసెన్స్ చేస్తున్నారని అన్నారు. తమ కాలనీ నుంచి వైన్స్‌ను తొలగించాలని, కొత్తగా అనుమతులు ఇవ్వవద్దని మోర్తాడ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు, గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాలు అందజేశారు. అయితే ఈ విషయమై మోర్తాడ్ ఎక్సైజ్ శాఖ అధికారులకు తమ ఇబ్బందులు చెప్పుకుంటే దురుసుగా మాట్లాడుతున్నారని కాలనీవాసులు ఆరోపించారు.

ఏర్గట్లలో ఎంఈవో కార్యాలయానికి భూమిపూజ

ఏర్గట్ల, 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యాశాఖ కింద సమగ్ర శిక్ష పథకములో భాగంగా ఎంఈవో కార్యాలయానికి సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ మాట్లాడుతూ ఎమ్మార్సీ కార్యాలయానికి నిధుల మంజూరు కోసం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్ళగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వారా 40 లక్షల 70 వేలు మంజూరు ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ రవి, ఏఈ మురళి, వీడీసీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, క్యాషియర్ జుంగల శ్రీనివాస్, ముస్కు మోహన్, గంగయ్య, చిన్న రాజన్న, పెద్ద నర్సయ్య, జుంగల గంగాధర్, కాంగ్రెస్ నాయకులు మునిమాణిక్యం అజయ్, దండె వేయిన సాయికుమార్‌లున్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం అభినందనీయం

బోధన్,నవంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కావాల్సిన కంప్యూటర్లు, నిత్యవసర వస్తువులు అందించడం స్ఫూర్తిదాయకమని పాఠశాల ప్రిన్సిపాల్ బాలచంద్రం అన్నారు. సోమవారం బోధన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇటీవల జోస్‌అల్కూకాస్ సంస్థ ఎస్ఆర్ ఫండ్ ద్వారా అందజేసిన సదుపాయాలను ప్రారంభ సమావేశం నిర్వహించారు. పాఠశాలకు అవసరమైన నీటి శుద్ధి యంత్రం, 20 డ్యుయల్ డెస్క్ బెంచీలు, రెండు కంప్యూటర్లు, ప్రింటర్, 25 సిలింగ్ ఫ్యాన్‌లను వారు వచ్చిన నగదు ద్వారా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం 3.72లక్షల రూపాయల చెక్కును ఇటీవల అందించారని వాటి ద్వారా వస్తువులను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జోయాలుక్కాస్ బ్రాంచ్ మేనేజర్ ధనీష్, అకౌంట్స్ మేనేజర్ జితిన్, పీఆర్‌వో పిప్పెర రవీందర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం

కోటగిరి,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, పుణ్యవచనం, గోపూజ, యాగశాల కార్యక్రమాలు కొనసాగాయి. వార్షికోత్సవ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం దేవతామూర్తులకు కుంభాభిషేకం, 108కలశాలతో అభిషేకం, అయ్యప్ప మహపడిపూజ కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు పోల విఠల్ గుప్తా తెలిపారు.

ప్రభుత్వ సలహాదారుడిని సన్మానించిన జన్నేపల్లి వాసులు

నవీపేట,నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పీ.సుదర్శన్ రెడ్డిని సోమవారం మండలంలోని జన్నేపల్లికి చెందిన పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డిని శాలువాతో వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంజీవ రావు, నరేందర్ రావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కమ్మర్‌పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాలతో అనారోగ్యపాలై చికిత్సలు చేయించుకున్న బాధితులకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎంరిలీఫ్ చెక్కులను సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు బాధితుల ఇండ్లకు వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సుంకెట రవి, బుచ్చిమల్లయ్య, సల్లూరి గణేష్ గౌడ్, సింగిరెడ్డి శేఖర్, అజ్మత్ హుస్సెన్, కిషన్‌గౌడ్, అజారోద్దీన్ పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మోర్తాడ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల అశోక్ పంపిణీ చేశారు. పదిమంది బాధిత కుటుంబాలకు రూ. 2 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ మహిపాల్ పాల్గొన్నారు

ముప్కాల్: ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాలకు సోమవారం అందజేశారు.కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ జైడి చందా రవి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజారెడ్డి, పాల్గొన్నారు.

ఎంపీవోలకు అభివృద్ధిపై శిక్షణ

బోధన్,నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఎంపీవోలుగా బాధ్యతలు చేపట్టిన బోధన్, రుద్రూర్ మండలాల ఎంపీవోలకు సోమవారం డీఎల్‌పీవో నాగరాజు గ్రామాల పనితీరుపై పలు సూచనలు ఇచ్చారు. సోమవారం బోధన్ మండలంలోని భూలక్ష్మీక్యాంప్ గ్రామ పంచాయతీలో బోధన్ ఎంపీవో వేణుయాలం, రుద్రూర్ ఎంపీవో అరవింద్‌లకు డీఎల్‌పీవో నాగరాజు గ్రామాల అభివృద్ధి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ మహేందర్‌తో తదితరులున్నారు.

అఖిల భారత సహకార వారోత్సవాలు

సాలూర,నవంబరు17(ఆంధ్రజ్యోతి): సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సంఘ చైర్మన్ అల్లె జనార్ధన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీలశంకర్, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారిణి శ్వేతలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ వైస్ చైర్మన్ సందీప్ రెడ్డి, సంఘ పాలకవర్గం, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శివపార్వతుల కల్యాణ క్రతువు సోమవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయంలో అర్చకులు పురుషోత్తమశర్మ, పాండురంగశర్మ, ప్రభాకర్ శర్మ, చంద్రశేఖర్‌శర్మలు ప్రత్యేక పూజలు చేపట్టారు. శివపార్వతుల ఉత్సవ మూర్తులను నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి పీఠంపై ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామికి, అమ్మవారికి జీలకర్ర బెల్లం కార్యక్రమం నిర్వహించారు. భీంరాజ్ కుటుంబ సభ్యులు కళ్యాణ ఘట్టాన్ని జరిపించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక గురుస్వామి బెజుగం శంకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డి, గురుస్వాములు విటల్‌రెడ్డి, స్వాములు తదితరులున్నారు.

75 మంది అయ్యప్ప దీక్ష స్వీకరణ



అయ్యప్ప మాలధారణ స్వీకరించిన భక్తులు

బాన్సువాడటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సుమారు 75 మంది భక్తులు అయ్యప్ప దీక్షను స్వీకరించారు. ఈ మేరకు వారందరికీ వ్యవస్థాపక గురుస్వామి బెజుగం శంకర్ మాలధారణ చేసి ఆశీర్వదించారు. 41 రోజుల పాటు దీక్షా నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పారాలీగల్ వలంటీర్లు

బాన్సువాడటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ మీడియేషన్ కార్యాలయంలో సోమవారం పారాలీగల్ వలంటీర్లు సీనియర్ సిటిజన్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 60 ఏళ్లకు పైబడి ఉన్న సీనియర్ సిటిజన్లకు ఏవైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని వారు కోరారు. ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు దాదాపుగా 11 కేసులను పరిష్కరించడం జరిగిందని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్లు పుష్పవతి, రామకృష్ణారెడ్డి, అయ్యాల సంతోష్, అహ్మద్ హుస్సేన్, నాగులగామ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు నిబంధ్‌నల సవాళ్లు

- సీసీఐ నిబంధనలపై కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ ఆగ్రహం
- పత్తి జిన్నింగ్ మిల్లుల బంద్‌కు పిలుపు
- ఎల్ -1, ఎల్-2 ఎల్ -3 విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్

మద్నూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తీరుపై జిన్నింగ్ మిల్లు యజమానులు నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం మద్నూర్ మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లు యజమానులు తమ మిల్లులను మూసివేసి పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. ఎల్- 1, ఎల్- 2, ఎల్- 3 కేటగిరిలో జిన్నింగ్ మిల్లులకు పత్తి అలాట్‌మెంట్‌పై మిల్లర్లు మండి పడుతున్నారు. సీసీఐ అనాలోచిత నిర్ణయాలపై సోమవారం నుంచి మిల్లుల బందుకు కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ పిలుపునివ్వడంతో మద్నూర్ మార్కెట్లో పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. జిన్నింగ్ మిల్లులను సీసీఐ మూడు కేటగిరీలుగా వర్గీకరించి పత్తి కొనుగోళ్లకు మిల్లులను కేటాయించారు. కపాస్ యాప్ ముందుగా ఎల్-1 మిల్లుల జాబితానే ప్రదర్శిస్తుంది. ఆ మిల్లులో సామర్థ్యం పూర్తయితే ఎల్ -2కు, ఆ తర్వాత ఎల్-3 మిల్లులకు అవకాశం ఇస్తుంది. అసలే వర్షాలకు పత్తి దిగుబడి భారీగా తగ్గింది. దీనికితోడు ఎల్-1, ఎల్-2 మిల్లుల సామర్థ్యం పూర్తయ్యేదెప్పుడో ఎల్-3 మిల్లులకు కేటాయించేది ఎప్పుడు అని మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ఈ విధానంపై జిన్నింగ్ మిల్లు యజమానులు అభ్యంతరం చెబుతున్నారు. అన్ని మిల్లులో కొనుగోలు ఒకేసారి చేపట్టాలని జిన్నింగ్ అండ్ కాటన్ ఇండస్ట్రీ అసోసియేషన్ డిమాండ్ చేస్తుంది.

అన్నదాతలకు పరేషాన్

సీసీఐ నిబంధనలతో ఇప్పటికే ఆగమాగం అవుతున్న పత్తి రైతులు, జిన్నింగ్ మిల్లుల బంద్ పిలుపుతో మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. సీసీఐ ఈ ఏడాది కొత్తగా తీసుకువచ్చిన కపాస్ యాప్ పత్తి అమ్ముకునేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవటం రైతులకు సవాల్‌గా మారింది. కపాస్ యాప్‌లో సూచించిన కేంద్రాల్లోనే పత్తి అమ్ముకోవాల్సి ఉండటంతో రైతులకు దూరభారం తప్పడం లేదు. దీనికి తోడు ఎకరాకు ఏడు క్వింటాళ్లే కొనుగోలు చేస్తామని సీసీఐ ప్రకటించడంతో పాటు కపాస్ యాప్‌లో ఈ మేరకు నిబంధనలను చేర్చడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మద్నూర్‌లో పత్తి కొనుగోళ్లను నిలిపివేసి నిరసన తెలియజేస్తున్న జిన్నింగ్ మిల్లు యజమానులు

బిల్లులు ఇప్పించండి



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

బీర్కూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పలువురు గృహలక్ష్మి పథక లబ్ధిదారులు సోమవారం బాన్సువాడ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. బిల్లులు చెల్లించాలని కోరుతూ నాయబ్ తహసీల్దార్ వెంకటరెడ్డికి వినతిపత్రం అందించారు. ఇళ్లు నిర్మించుకునే పేదలకు రూ.3 లక్షల ఆర్థికసాయం అందచేస్తామని గత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇందులో భాగంగా లబ్ధిదారుల జాబితా అధికారులు రూపొందించారని తెలిపారు. ఆ జాబితాలో తన పేర్లు ఉన్నాయని, ఈ మేరకు తాము అప్పులు చేసి మరీ ఇళ్లు నిర్మించుకున్నామని తెలిపారు. అనంతరం ప్రభుత్వం మారిపోయిందని తమకు బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మద్నూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ శారద తెలిపారు. సోమవారం డోంగ్లి మండల కేంద్రంలో బేటీబచావో- బేటీపడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకుముందు విద్యార్థులు మండలకేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. చైల్డ్ ప్రొటెక్షన్ కార్యాలయం నుంచి మోహన్, సఖి కేంద్రం నుంచి లావణ్య పాల్గొని విద్యార్థులకు చట్టాల గురించి అవగాహన కల్పించారు. మహిళల కోసం వరకట్న నిషేధ చట్టం 1961, గృహహింస నిరోధక చట్టం 2005, లైంగిక వేధింపుల నుంచి రక్షణ చట్టం 2013, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో చట్టం కింద జైలు శిక్ష విధించబడుతుం దన్నారు. చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని మంచి పేరు ప్రఖ్యాతాలు తీసుకురావాలన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సునీల్, సీఆర్పీ, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



మద్నూర్ మండలకేంద్రంలో విద్యార్థుల ర్యాలీ



బియ్యం పట్టుకున్న లారీతో ఎస్సై

పీడీఎస్ బియ్యం పట్టివేత

నసురుల్లాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్కి చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి పోలీసులు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ షర్ఫుద్దీన్ మాట్లాడుతూ 118.80 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం అందిందన్నారు. ఈ మేరకు పోలీసులు పెట్రోలింగ్ చేసి పట్టుకున్నారన్నారు. నస్రుల్లాబాద్ పోలీసుస్టేషన్‌లో సంబంధిత వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు మండల ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు.



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న కాసుల బాలరాజు

బాధిత కుటుంబానికి కాసుల బాలరాజు పరామర్శ

బాన్సువాడ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట్ గ్రామానికి చెందిన సప్తగిరి వస్త్ర దుకాణ యాజమాని వంజరి ఎరతి అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. నాయకులు భూనేకర్ ప్రకాష్, బోడ భాస్కర్, నాగేశ్వర్‌రావు, పోతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

23వ తేదీ నుంచి జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

బోధన్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలని జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్ అన్నారు. బోధన్‌లోని విజయమేరి ఉన్నత పాఠశాలలో ఈ నెల 23, 24, 25వ తేదీలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు సంబంధించి సోమవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సైన్స్ ప్రదర్శనను అత్యుత్తమంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు, కమిటీలు చురుకుగా పని చేయాలన్నారు. జిల్లాలోని 10మండలాల విద్యాశాఖ అధికారులు. సైన్స్ ఫెయిర్ జిల్లా కమిటీ సభ్యులు సమన్వయంతో అన్ని కమిటీలు పని చేసి జిల్లా విద్య వైజ్ఞానిక సదస్సును విజయవంతం చేయాలన్నారు. బోధన్, సాలూర, మోస్రా మండలాల ఎంఈవోలు నాగయ్య, రాజ మంజూష, నాగనాథ్, కమిటీ సభ్యులు తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

జక్రాన్‌పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఉత్సవాలలో భాగంగా యజ్ఞం కాల్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో హాజర య్యారు. మంగళవారం ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరగనున్నాయని గౌడ సంఘం అధ్యక్షుడు లింబాద్రి గౌడ్ తెలిపారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గౌడ సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు సాయాగౌడ్, వేంపల్లి శ్రీనివాస్ గౌడ్, రావుట్ల శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్, సురేష్ గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'అమెరికా అనుభవం' పుస్తకావిష్కరణ

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో వివిధ ప్రాంతాల ప్రత్యేకతను తెలియజేస్తూ రమేష్ రచించిన అమెరికా పర్యటన అనుభవం పుస్తకాన్ని ప్రముఖ క్రీడాకారుడు డాక్టర్ నర్సయ్య ఆవిష్కరించారు. సోమవారం నగరంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశం నుంచి ఎంతో మంది అమెరికా దేశానికి వెళ్లిన పుస్తకం రాయాలనే ఆలోచన మాత్రం చేయలేదని రచయిత అమెరికాలోని ప్రాంతాల విశేషాలను తెలియజేస్తూ పుస్తక రూపంలో అందుబాటులోకి తేవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ రచయిత బండోజి సతీష్, గంగాకిషన్, హన్మంత్‌రావు, చంద్రకాంత్, జగన్మోహన్‌రెడ్డి, ఖాజామోయినొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు కళాకారిణికి బాలరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీకృతి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తన కళాప్రదర్శనతో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను మెప్పించిన బెజగం శ్రీకృతికి కూచిపూడి నృత్యకళాకారిణిగా బాలరత్న అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో కళాకార్ తెలుగు టీవీ నిర్వహించిన బాలరత్న అవార్డు కార్యక్రమంలో సయ్యద్ మీర్ సీనియర్ కెమెరామెన్, డైరెక్టర్, సినీ హీరోయిన్ ట్వింకిల్ కపూర్, బిగ్‌బాస్ ఫేమ్ కిరాక్ సీత చేతుల మీదుగా ఈ అవార్డును అందుకుంది. కృతిక నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మేరిమాత స్కూల్‌లో 5వ తరగతి చదువుతూ గతంలో అనేక ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు, రివార్డులను అందుకుంది.

మనోహరాబాద్‌లో నెదర్లాండ్ ప్రతినిధుల పర్యటన

జక్రాన్‌పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో సోమవారం పసుపు ఉత్పత్తిదారుల పరిశ్రమను నెదర్లాండ్ కంపెనీ ప్రతినిధి (వృస్తే గస్ స్పైసెస్ అండ్ సాసిస్ ఎక్స్‌పోర్ట్ కంపెనీ ప్రతినిధి) బెంగళూరుకు చెందిన మనోజ్ కుమార్ సందర్శించారు. అనంతరం పరిశ్రమ కేంద్రంలో పసుపు పౌడర్ తయారుచేసే యంత్రాలను ఆయన పరిశీలించారు. రైతులు పసుపు ఉత్పత్తి చేసి విలువ ఆధారిత వస్తువులుగా తయారు చేస్తున్నారని తెలుసుకొని రైతుల వద్ద తమ కంపెనీ కొనుగోలు చేస్తే బాగుంటుందని చెప్పి కంపెనీ ప్రతినిధిగా వచ్చినట్లు పరిశ్రమ సభ్యులకు వివరించారు. ఇక్కడి రైతులు కష్టపడి పండించిన పసుపును తమ కంపెనీ కొనుగోలు చేసేలా కంపెనీకి ప్రతిపాదన చేస్తానని రైతులకు తెలిపారు. ఆయన వెంట జేఎంకేపీఎం చైర్మన్ పి.తిరుపతి రెడ్డి, సభ్యులు, రైతులు ఉన్నారు.



యంత్రాలను పరిశీలిస్తున్న నెదర్లాండ్ కంపెనీ ప్రతినిధి మనోజ్‌కుమార్

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



బరంగ్‌ఏడ్గిలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బీర్కూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బరంగ్ ఏడ్గి ప్రభుత్వ పాఠశాలలో ప్రకృతిని కాపాడుకోవడం ఎలా అనే అంశంపై సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించగా విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రకృతిని కాపాడుకోవడంపై విద్యార్థులు వివిధ రకాలుగా చిత్రాలు వేశారు. అనంతరం గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు విఠల్ ప్రకృతిని కాపాడుకునే విధానాలను ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రమేష్, సభ్యులు విఠల్, రషీద్, కార్తీక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని పాఠశాల స్థాయి విద్యార్థులకు పరిసరాలు పరిశుభ్రత అనే అంశంపై చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. సోమవారం గ్రంథాలయ ఆవరణలో నిర్వహించిన పోటీలో వివిధ పాఠశాలలకు చెందిన 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి హాజరై మాట్లాడారు. పెద్ద సంఖ్య విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ రాజరెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం, పోటీ నిర్వాహకులు రాజేంద్ర ప్రసాద్, గ్రంథాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఇరుకు గదులు.. ఇక్కట్ల చదువులు

నసురుల్లాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కొరతతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పట్లేదు. కనీసం కూర్చోవడానికి గదులు లేకుండా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. నసురుల్లాబాద్ మండలంలోని హాజీపూర్, లింగంపల్లి గ్రామాల్లో కేవలం ఒక గదిమాత్రమే ఉండటంతో విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారింది. చిన్నారులకు సరిపడా గదులు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఒక్కో గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మాణ పనులు చేప ట్టారు. కానీ బిల్లులు విడుదల కాకపోవడంతో భవనాలు అర్ధంతరంగా నిలిచి పోయాయి. దీంతో ఒకే గదిలో 5తరగతులు ఏర్పాటుచేసి ఇద్దరు ఉపాధ్యాయులు విద్యను చెబుతున్నారు.

వరండాలో బోధన..

మండలంలోని రాములుగుట్ట తండాలో చిన్నారులకు కేవలం ఒక గది మాత్రమే ఉండటంతో పాఠశాల వరండాలోనే తరగతులను నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులు గుంపులుగా కూర్చొని చదువుకుంటున్నారు. దీంతో చదువుపై సరిగా దృష్టిసారించలేకపోతున్నారు. అంతేకాకుండా ఉన్నత తరగతులకు వెళ్లినప్పుడు ఇబ్బంది పడక తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో నిర్మాణ దశలో నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.



లింగంపల్లి తండాలో వరండాలోనే విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు

రక్తహీనత శాపం.. అప్రమత్తతే మార్గం

- గర్భిణుల్లో పెరుగుతున్న రక్తహీనత సమస్య
- పోషకాహారం తీసుకోవాలంటున్న వైద్యులు

డొంకేశ్వర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు, గర్భిణుల్లో రక్తహీనత శాపంగా మారుతోంది. ఈ సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఫలితాలు అంతంత మా త్రమే ఉంటున్నాయి. గర్భిణులు పోషకాహారం తక్కువగా తీసుకోవడమే ఇందుకు కారణమని వైద్యులు చెబుతున్నా రు. డొంకేశ్వర్ పీహెచ్‌సీ పరిధిలో 6 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. అక్టోబర్ 2024 నుంచి అక్టోబర్ 2025 వరకు 900 మంది మహిళలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించగా 180 మంది సాధారణ, మధ్య, తీవ్ర రక్తహీనతలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది.

మహిళలకు తలెత్తుతున్న సమస్యలు

వివాహానికి ముందు కొందరు మహిళలకు రక్తహీనత ఉంటుంది. పెళ్లి అయిన తరువాత గర్భిణిగా ఉన్నప్పుడు శిశువు పెరిగే కొద్దీ అధికమవుతుంది. దీంతో త్వరగా అలసిపోవడం, నీరసం, ఆయసం, గుండె దడ, కాళ్లవాపులు, వంటి సమస్యలు మహిళలకు ఎదురవుతుంటాయి. ఇలాంటివారికి ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్ ఐరన్ మాత్రలను వైద్యులు అందిస్తున్నారు. సాధారణంగా మహిళలకు 10 నుంచి 11 గ్రాముల వరకు రక్తం ఉండాలి. అయితే రక్తహీనత ఉన్న 3 నెలల గర్భిణుల నుంచి డెలివరీ అయ్యేంత వరకు 180 ఐరన్ మాత్రలను 3 నెలలకు ఒకసారి గర్భిణులకు అందిస్తున్నారు. వీటిని రోజుకు రెండు చొప్పున తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఐరన్ గ్లూకోజ్‌ను అందిస్తున్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండి ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ఇతరులతో పోలిస్తే ఎక్కువగా ఇబ్బంది పడతారు.



డొంకేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణికి ఐరన్ గ్లూకోజ్‌ను అందిస్తున్న వైద్యురాలు

పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



నెలకు ఒకసారి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మాత్రలను అందిస్తున్నాం. ఇందులో ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు ఉన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలి. ఆకుకూరలను ఆహారంలో భాగం చేసుకోవాలి. పోషక విలువలు కలిగిన పండ్లు, పాలు, కూరగాయలు తీసుకోవాలి.

- సుభాకర్, మండల వైద్యాధికారి, డొంకేశ్వర్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

వయోవృద్ధుల వారోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు ఈ నెల 12 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమ దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ అధికారి రసూల్ బి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి చేతుల మీదుగా వయోవృద్ధుల వారోత్సవ పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం రాసూల్ బి మాట్లాడుతూ.. 19న పాత కలెక్టరేట్ కార్యాలయం నుంచి న్యూ అంబేద్కర్ భవన్ వరకు విద్యార్థులతో వయోవృద్ధులతో అవగాహన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ భవన్‌లో ప్రపంచ వయోవృద్ధుల జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, అసోసియేషన్, ట్రస్టులు, ఫౌండేషన్స్, వృద్ధాశ్రమాల నిర్వాహకులు, వయోవృద్ధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్తీక శోభ..

(5వ పేజీ తరువాయి)

ఆలయ ప్రాంగణంలో వివిధ ఆకృతులలో పేర్చిన దీపెంతలను వెలిగించారు. పలు ఆలయాల్లో భక్తులు నెయ్యితో చేసిన వత్తులను ధ్వజస్తంభం వద్ద ఉంచి అఖండ దీపారాధన చేశారు. కార్తీక మాసం శివుడికి ప్రీతికరమైన చివరి రోజు కావడంతో పలు ఆలయాల్లో శివుడికి డోలారోహనంతో పాటు అన్నపూజ చేసి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయంలో నిర్వహించిన కార్తీక పూజలో ఆలయ అర్చకులు సుహాస్ శాఖాయ్, మకరంద్ శాఖాయ్, నీలేష్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి పర్యవేక్షణలో సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని కోనేరుకు కార్తీక హారతిని సమర్పించుకున్నారు. అదే విధంగా శంభులింగేశ్వర ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. జిల్లా కేంద్రంలోని ఉమామహేశ్వర ఆలయం, మనోకామేశ్వర ఆలయం, అమరలింగేశ్వర ఆలయం, ఓంకారేశ్వర ఆలయం, పార్థివలింగేశ్వర ఆలయం, భీమరాయ ఆలయం, కాశీ విశ్వేశ్వర ఆలయం, నందిగుట్ట తదితర ఆలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది.

మంత్రులను కలిసిన ఫోరం అధ్యక్షుడు గంగారెడ్డి

మోపాల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న సమస్యలపై సోమవారం నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిటీ ఫోరం అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి మర్యాధపూర్వకంగా హైదరాబాద్‌లో మంత్రులను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డిలను కలిసి మార్కెట్ యార్డులో ఉన్న సమస్యలపై వినతిపత్రాలను సమర్పించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను తొందరగా పరిష్కరించాలని మంత్రులను ఆయన కోరారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిటీ చైర్మన్లు కమిటీ ఫోరం సభ్యులు ఉన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

మోపాల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను వెంటనే సంబంధిత డాక్టర్లను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని డాక్టర్లు సూచించారు. సోమవారం మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొబైల్ ఐసిటిసి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గ్రామాల్లోని ప్రజలు రక్తపరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలతో పాటు వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే మంచి ఆహారాన్ని తీసుకోవాలని చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి ఇంచార్జి శివ, గ్రామ కార్యదర్శి వెంకటేశ్, సాయికిరణ్‌గౌడ్, సంపూర్ణ, ఆశావర్కర్లు, కవిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రగ్గుల పంపిణీ

మోపాల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):మోపాల్ మండలం బీసీ హాస్టల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు చలినుండి కాపాడుకునేందుకు తమ వంతు బాధ్యతగా రగ్గులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భగవాన్, నర్సింహారావు, రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్స అంజనేయులు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలి



మాట్లాడుతున్న వేల్పూరు భూమయ్య

నిజామాబాద్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయనప్పుడు గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఏమి తేడాలేదని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. సోమవారం నగరంలోని ద్వారకనగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఏర్పాటు చేసిన పాత్రికే యుల సమావేశం లో వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ... మూతపడిన నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఇచ్చిన మాట తప్పిందని విమర్శించారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకునివెంటనే ఫ్యాక్టరీని తెరిపించాలన్నారు. మోపాల్ మండలంలోని మంచిప్ప ప్రాజెక్టు ప్యాకేజీ-21 పనులుపూర్తిచేయాలని కోరారు. దేశంలో నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నరని ప్రభుత్వం వెంటనే విత్తన చట్టం తీసుకురావాలన్నారు. నాయకులు ఆగ్గు ఎర్రన్న, బి.సాయిలు, ఆగ్గు చిన్నయ్య, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బిల్లులు మంజూరు చేయాలి

నిజామాబాద్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా 54,200 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారని, వారికి బిల్లులు రావడం లేదని ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖలు రాశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతినెలా విద్యార్థులకు వండిపెట్టిన వంట బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు రూ. 10 వేల వేతనాలు ఇస్తానన్న హామీ నెరవేర్చాలన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్ ప్రమాద నష్టపరిహార బీమా, పీఎఫ్, ఈఎస్ఐ, యూనిఫారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సాయమ్మ, భూదేవి, లావణ్య, శంకర్, గంగాధర్, సరస్వతి, కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

సిరికొండ,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ తండాలో ప్రమాదవశాత్తు నివాస గుడిసె కాలిపోయిన బాధిత కుటుంబానికి డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ బాస్కర్‌రెడ్డి ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర సరుకులను అందజేశారు. సిరికొండ మండలం సర్పంచ్ తండాలో మెగావత్ లక్ష్మి ఇల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల కాలిపోయింది. ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాలతో బాస్కర్‌రెడ్డి సోమవారం ఐదువేల ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఇందిరమ్మ పథకంలో ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గౌసొద్దిన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల బుచ్చన్న పాల్గొన్నారు.

'ప్రజావాణి' వినతులను సత్వరమే పరిష్కరించాలి

» కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించేవిధంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 101 వినతలు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్‌లు అంకిత్, కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో సాయాగౌడ్, ట్రైని డిప్యూటీ కలెక్టర్ సందిప్, ట్రైని కలెక్టర్ కరోలియాన్ చింగ్థియాన్ మావి, డీఈవో శ్రీనివాస్‌కు అర్జిలను సమర్పించారు.

వికలాంగుల పెన్షన్ ఇప్పించాలి..

వికలాంగుల పెన్షన్‌ను ఇప్పించాలని మోర్తాడ్ మండలకేంద్రానికి చెందిన అజారి కృష్ణ, అంజలి దంపతులు తమ వికలాంగ కూతురైన ఆద్యాతో కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చిన్ననాటి నుంచే వికలాంగురాలైన ఆద్యాకు దినసరి కూలీలైన మేము ఆద్య చికిత్స కోసం లక్షలు ఖర్చుచేసి అప్పుల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. పూటగడవని దీన స్థితిలో ఉన్నామని ప్రభుత్వం స్పందించి ఆద్యాకు దివ్యాంగుల కోటాలో పించన్ ఇప్పించాలని కోరారు.

రూరల్ ఎమ్మెల్యే పీఏపై చర్యలు తీసుకోవాలి..

ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూ ప్రజాప్రతినిధిగా


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

పీఏగా చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గౌతంకుమార్, జన్నారపు రాజేశ్వర్ జిల్లా నాయకులు మనోజ్, నగర అధ్యక్ష కార్యదర్శులు పవన్, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్‌ల నుంచి కాపాడాలి..

ప్రైవేట్ ఫైనాన్స్‌ల నుంచి కాపాడాలని ఎడపల్లి మండలం కుర్నాపల్లికి చెందిన దంపతులు విమల, రాజశేఖర్‌లు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్ని కారణాల వల్ల ప్రైవేట్ ఫైనాన్స్‌లో 3లక్షలు అప్పుగా తీసుకోవడం జరిగిందని కొన్ని నెలలుగా కట్టకపోవడంతో ఇంటికి వచ్చి భయబ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కొన్ని రోజులు సమయం ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు.

తరగతి గదిని బాగుచేయాలి..

మోపాల్ మండలంలోని ఒడ్డెర కాలనిలోని మండల ప్రజాపరిషత్ పాఠశాల పైకప్పును బాగుచేయాలని ఒడ్డెర కాలని వీడిసి సభ్యులు ప్రజావాణిలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే పైకప్పు కూలీపోయిందని తరతగతి గదిలో పిల్లర్ భయంతో కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. పాఠశాల పైకప్పునకు నిధులు మంజూరు చేయించి పాఠశాల గదులు నిర్మించాలని కోరారు.

పోలీస్ ప్రజావాణికి 20 ఫిర్యాదులు

సుభాష్‌నగర్: పైరవీలు లేకుండా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు ప్రజావాణి కార్యక్రమానికి 20 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందని తెలిపారు.

డీసీసీపై వీడని ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

కార్యకర్తల నుంచి అభిప్రాయాలు తీసుకుంది. ప్రధానంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి చెందిన పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డిలు కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం పోటిపడుతున్నారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన గ్రంథాలయ మాజీ చైర్మన్ మారా చంద్రమోహన్, బోధన్‌కు చెందిన గంగాశంకర్, బాల్కొండకు చెందిన వేణుగోపాల్‌యాదవ్‌లు పోటీలో నిలిచారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాల ప్రకారం ప్రధానంగా పోటీ శేఖర్‌గౌడ్, నగేష్‌రెడ్డిల మధ్య ఉన్నట్లు పార్టీ వర్గాల ద్వారా సమాచారం. ఓసీ వర్గానికి ఇవ్వాలనుకుంటే నగేష్‌రెడ్డికి, బీసీ వర్గానికి ఇవ్వాలనుకుంటే శేఖర్‌గౌడ్‌కి కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి దక్కే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్‌లపై సుప్రీం కోర్టుకు వెళ్లిన ప్రభుత్వం పార్టీ పదవులు, పార్టీ పరంగా స్థానిక సంస్థల్లో 42శాతం టికెట్‌లను బీసీలకు ఇవ్వాలని నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి బీసీకి దక్కినా ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదు.

నిండుకుండలా జలాశయాలు

(5వ పేజీ తరువాయి)

నుంచి అక్టోబర్ వరకు 1140.4 ఎంఎం వర్షం కురవగా అంటే 114.4 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు ఆమె తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది సుమారు 20 సెంటీమీటర్ల వర్షం అధికంగా కురిసినట్లు ఆమె వివరించారు. దీంతో చెరువుల ఆయకట్టుకింద అలాగే వ్యవసాయ బావుల్లో, బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగాయని ఆమె తెలిపారు. కురిసిన భారీ వర్షాలకు ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, సోయ ఇతర కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం, మొక్కజొన్న పంటలు తడిసి ముద్దాయ్యాయని, కురిసిన వర్షాలకు ఆరబెట్టిన ధాన్యంతో పాటు మొక్కజొన్న పంట కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కురిసిన భారీ వర్షాలకు అన్ని గ్రామాల్లో రానున్న యాసంగి పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ పంటలు గట్టెక్కినప్పటికి రానున్న యాసంగి పంటల సాగుకు ఢోకా లేదని రైతులు తెలిపారు. ఈ యాసంగిలో వరి, మొక్కజొన్న, తెల్లజొన్న, ఎర్రజొన్న, ఇతర కూరగాయల పంటలను రైతులు సాగుచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరి మొలక అలుకగా, మొక్కజొన్న, ఎర్రజొన్న, తెల్లజొన్న పంటల విత్తనాలను వేశారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో పండించిన ధాన్యంతో పాటు మొక్కజొన్న, ఇతర పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

యాసంగి పంటలకు సాగునీటికి ఢోకా లేదు...

● బెల్దారి రాజన్న, రైతు, అర్గుల్



వర్షాకాలంలో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్న దశలో వర్షాలు కురువడంతో వేసిన పంటలు గట్టెక్కాయి. కురిసిన భారీ వర్షాలకు ధాన్యం, మొక్కజొన్న, సోయ ఇతర పంటలు నష్టపోయాం. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రస్తుతం ఖరీఫ్ పంటలు గట్టెక్కాయి. కురిసిన వర్షాలకు వ్యవసాయ బావుల్లో, బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగాయి. రానున్న యాసంగి పంటల సాగుకు సాగునీరుకు ఢోకా లేదు.

యాసంగి పంటల సాగుకు సన్నద్ధమైతున్న రైతులు....

● దేవిక, వ్యవసాయాధికారిణి, జక్రాన్‌పల్లి



మండలంలో ఈ యాసంగి పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వరి పంట 13,650 ఎకరాల్లో సాగు చేయనున్నారు. 3,500 ఎకరాల్లో మొక్కజొన్న పంటను, ఎర్రజొన్న 2,000 ఎకరాలు, 200 ఎకరాల్లో తెల్లజొన్న పంటను సాగుచేయనున్నారు. వర్షాకా లంలో మండలంలోని వివిధ గ్రామాలలో సుమారు 110 ఎకరాల్లో వరిపంట నేలకొరిగింది. దీంతో రైతులు నష్టపోయారు. వరిపంట నష్టంపై ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదికను పంపించాం. తెల్లజొన్న , ఎర్రజొన్న పంటలు సాగుచేసే రైతులు వ్యాపారులతో ఒప్పందం చేసుకొని ఈ పంటలను సాగుచేసుకోవాలి.

ఆదర్శ పాఠశాలలో ప్యానల్ ఇన్‌స్పెక్షన్

ధర్పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల ఆదర్శ పాఠశాలను ఏడుగురుసభ్యులు గల ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీమ్ సోమవారం సందర్శించారు. ఈ ప్యానల్ టీమ్‌కు సిద్ధిపేట జిల్లా దౌలతాబాద్ ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ నాయకత్వం వహించారు. ప్యానల్ సిబ్బంది పాఠశాలలో బోధన, తరగతి గదుల నిర్వాహణ, బోధన పద్దతులను పరిశీలించి వారికి తగిన సూచనలు ఇచ్చారు. పాఠశాల ఆవరణ, క్రీడా ప్రాంగణం, ల్యాబ్‌లు, తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువకులు దూరంగా ఉండాలి


తాటిపల్లి గ్రామం సీసీ టీవీలను ప్రారంభిస్తున్న సీఐ భిక్షపతి

సిరికొండ,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి, హెరాయిన్ లాంటి మత్తుపదార్థాలకు యువకులు దూరంగా ఉండాలని ధర్పల్లి సీఐ భిక్షపతి కోరారు. సిరికొండ మండలం తాటిపల్లి గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న సీసీ టీవీలను సోమవారం సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ టీవీల ఏర్పాటు వల్ల గ్రామంలో జరిగే చోరీలు, దోపిడీలను, ఇతర అసాంఘిక కార్యక్రమాలను నిరోధించుకోవచ్చని చెప్పారు. ఒక్క సీసీటీవీ ఐదుగురు జవానులతో సమానమన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే అనేక దుష్పరిణామాలకు దారిస్తుందన్నారు. జీవితం నాశనమవుతుందన్నారు. కేసుల్లో ఇరుక్కుపోయి ఇబ్బందుల పాలవుతారని సీఐ గుర్తు చేశారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. యువకులు, పిల్లలకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో సిరికొండ ఎస్సై జాడీ రామకృష్ణ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు ఈర్ల శేఖర్‌ను ఆదుకోవాలి


పరామర్శిస్తున్న జాగృతి నాయకుడు రాజు

సుభాష్‌నగర్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుడు ఈర్ల శేఖర్‌ను పార్టీలకు అతీతంగా ఆదుకోవాలని తెలంగాణ జాగృతి నిజామాబాద్ అర్బన్ బాధ్యుడు రాజు అన్నారు. జిల్లాకేంద్రంలోని వీక్లి మార్కెట్‌లో గల ఈర్ల శేఖర్ స్వగృహానికి వెళ్లి సోమవారం పరామర్శించారు. గత కొన్ని రోజులుగా శేఖర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో వందలసార్లు అరెస్టు అయి కోర్టు కేసులో లాఠిదెబ్బలు తిన్నాడని అన్నారు. శేఖర్‌లాంటి ఉద్యమకారుల త్యాగాల వల్లనే తెలంగాణ రాష్ట్రం సాదించుకున్నామని తెలిపారు. ప్రతిఒక్కరు మానవత దృక్పంతో అండగా నిలవాలని కోరారు. శేఖర్ ఆరోగ్య పరిస్థితిని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత దృష్టికి తీసుకెళ్లి కుటుంబాన్ని ఆదుకునేలా ప్రయత్నం చేస్తామన్నారు.

1వ టౌన్ పరిధిలో కమ్యూనిటీ కాంటాక్ట్


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

సుభాష్‌నగర్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం కమ్యూనిటి కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీపి రాజవెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సుమారు 100 మంది కానిస్టేబుళ్లతో రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్ రోడ్డు పక్కన ఉన్న అనాధలు, అపరిచిత వ్యక్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతంలో అనుమానంగా సంచరిస్తున్నవారి పూర్తి వివరాలు తెలుసుకుని వారి ఫోటోలను తీసుకున్నారు.

రెండు లక్షల ఆర్థిక సహాయం

సిరికొండ,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పీఎంజేజేవై పథకంలో బీమా చేసుకుని మరణించిన మహిళ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల చెక్కును సోమవారం తెలంగాణ గ్రామీణబ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ అందజేశారు. చిల్కూరి గంగారెడ్డి టీజీబీలో రూ.436 చెల్లించి బీమా చేయించుకోవడం వల్ల రూ.రెండు లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని మేనేజర్ తెలిపారు.ఆమె కుమారుడు గంగారెడ్డికి చెక్కును సోమవారం అందజేయడం జరిగిందన్నారు. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఖాతాలు ఉన్న వారు 20 రూపాయలతో బీమా చేయించుకున్న వారు ప్రమాదంలో చనిపోతే రెండు లక్షలు, 436 రూపాయలు చెల్లించి బీమా చేయించుకున్నా వారు సాధరణంగా గాని ప్రమాదంలో గాని చనిపోతే వారిక కుటంబానికి రూ రెండు లక్షల బీమా డబ్బులను చెక్కు రూపేణ భారత ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఎఫ్ ఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎంఎస్‌బివై, పీఎంజెజెవై, ఏపీవై ఎస్ఎస్‌వై పథకాలు పొదుపు చేసుకోవడం వల్ల మంచి ఆర్థిక ఫలితాలను అందుకుంటారని చెప్పారు.


చెక్కును అందజేస్తున్న మేనేజర్ శ్రీనివాస్

ఆపదమిత్ర సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : ఆపదమిత్ర వాలంటీర్లుగా ప్రత్యేక గుర్తింపులేదని, గుర్తింపుకార్డులు ఇవ్వాలని ఆపదమిత్ర వాలంటీర్లు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపదమిత్ర వాలంటీర్ల జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ వాలంటీర్లకు గుర్తింపుకార్డులు, సర్టిఫికెట్, టూల్‌కిట్‌లు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే 300ల మందికి న్యాక్ భవనంలో శిక్షణ ఇచ్చారని ఎలాంటి గుర్తింపుకార్డులు ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికైన గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సాయికుమార్, నవీన్ కుమార్, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

రామడుగు పేదల భూముల సమస్య పరిష్కరించండి

● సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా నాయకుడు

ధర్పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామడుగు పేదల భూముల సమస్య పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని, సర్వే నెంబర్ 1150లో పట్టాలు ఇచ్చిన 270 మందికి భూములను అప్పగించకుంటే కబ్జాలకు వెళతామని, రెవిన్యూ, అటవీ శాఖ అధికారులు జాయింట్ సర్వే చేసి పేదల భూములను అప్పగించాలని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా నాయకుడు ఆర్.రమేష్ అన్నారు. సోమవా రం ధర్పల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఏఐయుకేఎస్, సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ ధర్పల్లి, సిరికొండ మండలాల సంయుక్త కమిటీ ఆధ్వర్యంలో ప్రాజెక్టు రాముడు గ్రామానికి చెందిన 1150 సర్వే నెంబర్‌లో పట్టాలు పొందిన లబ్ధిదారులతో ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, భూబాధితులు

రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 20 ఏళ్ల కింద పేదలను గుర్తించి 270 మందికి పట్టాలు చేసి డిజిటల్ పాస్ బుక్ సైతం ఇచ్చిందని అన్నారు. పంటలు పండించుకుందామనుకున్న సమయంలో అటవి శాఖ అధికారులు భూమిలేని పేదలను అడ్డుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని రెవెన్యూ, అటవీ శాఖ జాయింట్ సర్వే చేస్తామని హామీ ఇచ్చి కూడా ఏళ్లు గడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు కె.రాజేశ్వర్, ఏఐయుకేఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.దామోదర్, మండల నాయకులు డి.రాంచందర్, టి.జాన్, కె.శ్రీనివాస్, ఏ.సాయిలు, ఎన్.రవి, కె.రాజేష్, జంగం సిద్దవ్వ, నక్క ముత్తవ్వ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ పోలీసుస్టేషన్ తనిఖీ చేసిన ఏసీపీ

నిజామాబాద్ సిటీ (రూరల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న రూరల్ పోలీసు స్టేషన్‌ను ఏసీపీ రాజవెంకట్ రెడ్డి తనిఖీ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు రూరల్ ఠాణాకు వెళ్లి సిబ్బంది హాజరును పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు, లోక్ అదాలత్‌కు వచ్చిన కేసులు, ఇతర వివరాలు సేకరించారు. రూరల్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్, ఎస్ఐ-1 మహ్మద్ ఆరీఫ్‌లతో ఏసీపీ రెండు గంటలు పోలీసు స్టేషన్‌లో ఉండి కేసుల తీరు తెన్నులను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే ఏసీపీ రూరల్ పోలీసు స్టేషన్‌కు వచ్చారని, ప్రతీ రోజు ఏదో ఒక పోలీసు స్టేషన్ తనిఖీలు చేస్తారని సీఐ తెలిపారు.

సినిమా గైడ్

దేవి	: కాంత (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: ది గర్ల్‌ఫ్రెండ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: దేదే ప్యార్‌దే-2 (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్	: మాస్‌జాతర (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: కాంత (10.30, 1.30, 4.40, 7.40, 10.30)
స్క్రీన్-2	: ది గర్ల్‌ఫ్రెండ్ (11.00, 1.40, 7.30)
	: దేదే ప్యార్‌దే- (హింది) (4.30, 10.30)
స్క్రీన్-3	: శివ(రీరిలీజ్) (11.00, 1.40, 4.40, 7.30)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: దేదే ప్యార్‌దే- (హింది) (10.00)
	: కాంత (1.05, 7.20, 10.40) : ది గర్ల్‌ఫ్రెండ్ (4.25)
స్క్రీన్-2	: కాంత (10.10)
	: దేదే ప్యార్‌దే- (హింది) (1.30, 7.50, 10.55)
	: సంతానప్రాప్తిరస్తు (4.35)
స్క్రీన్-3	: శివ (రీరిలీజ్) (10.00)
	: లవ్ ఓటిపి (1.05), : కాంత (4.20)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (7.40, 10.35)
స్క్రీన్-4	: సి మంతం (12.35), : గోపిగాళ్ల గోవా ట్రిప్ (3.00)
	: సీతా ప్రయాణం కృష్ణతో (5.20),
	: ది గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో (8.10) : శివ (రీరిలీజ్) (10.40)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,25,500	రూ.1,16,000	రూ.1645

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో) :	రూ.140	రూ.250	రూ. 270
వెన్‌కాబ్(కిలో) :	రూ.150	రూ.260	రూ. 280

